ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాటే శరణ్యం

– సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు స్టాలిన్

విశాలాంధ్ర – గాజువాక: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీపీఐ శ్రేణులు పోరు సాగించాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏ.జె స్టాలిన్ పిలుపునిచ్చారు. చైతన్య నగర్‌లో సోమ వారం సీపీఐ చిన గంట్యాడ శాఖా సమావేశం జి.ఆనంద్ అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని ఉద్దే శించి స్టాలిన్ మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా సీపీఐ ఉద్యమాన్ని చేపట్టిందని అన్నారు. పెరిగిన ధరలను అదుపుచేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేసామని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం ప్రైవే టీకరించడాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని అన్నారు. ప్రభుత్వ రంగం నిర్వీర్యమైతే ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో చిన గంట్యాడ శాఖా కార్యదర్శి అప్పారి విష్ణు మూర్తి, నాయకులు ఆనంద్, దొడ్డి మల్లేశ్వరరావు, పొనగంటి భాస్కర్, కె.వి.కుమారి పాల్గొన్నారు.

భీమిలిలో సమస్యలు పరిష్కరించాలి: గంటాకు సీపీఐ విజ్ఞప్తి

విశాలాంధ్ర – భీమిలి: తగరపువలసలో రైతు బజార్, బస్ స్టాప్ షెల్టర్, ఆర్టీసీ క్యాంప్లెక్స్, హైస్కూలు రోడ్డు విస్తరణ, డ్రింకింగ్ వాటర్ ఫిల్టర్, చిట్టివలస శ్మశాన వాటిక, స్నాన ఘాట్లుగా శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును భీమిలి సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం తగరపువలస సీపీఐ కార్యాలయం జీఆర్ భవనంలో జరిగిన సమావేశంలో ఏరియా పార్టీ కార్యదర్శి కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, సన్నిబాబు, గోవింద్, లక్ష్మణరావు, ఈశ్వరరావు, రాంపైడి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు- 2024 ముగింపు వేడుకలను పోర్ట్ పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటో రియంలో ఘనంగా నిర్వహించారు. సీబీఐ ఎస్పీ మురళీ రాంభా గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడారు. అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకు నిర్వహించిన విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ సంవత్సరం "దేశం యొక్క శ్రేయస్సు కోసం సమగ్రత సంస్కృతి" అనే థీమ్‌తో నిర్వహించినట్టు, సత్యనిష్ఠ, పారదర్శకత మరియు అవినీతిరహిత సమాజం సృష్టించడం ద్వారా భారతదేశ స్థాయిని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వివిధ పోటీలు, ఎలోక్యుషన్, క్విజ్, వ్యాస రచన విక్రేతల సమావేశం వంటి కార్యక్రమాలను నిర్వహించింది. పోటీలలో గెలుపొందిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేసారు. ఐఓఎఫ్ఎస్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎస్.ఎల్.స్వామి, ఇతర విభాగాధిపతులు, పోర్ట్ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు. పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ ఈ వివరాలను మీడియాకు తెలియజేశారు.

అర్హులందరికీ పెన్షన్లు

విశాలాంధ్ర – మల్కాపురం: అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు, టిడ్కో ఇల్లు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని 61వ వార్డు టీడీపీ అధ్యక్షులు మజ్జి సోమేష్ పేర్కొన్నారు. సోమవారం మల్కాపురం జాలర వీధి కళ్యాణ మండపంలో అవగాహన సదస్సును నిర్వహించి మాట్లాడారు. ప్రతి లబ్ధిదారునికి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అందవలసిన సంక్షేమ పథకాలన్నీ అందుతాయని అన్నారు. గురువారం ఏడుగుడుల కూడలి వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నారని ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గణబాబు పాల్గొని ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి అర్హులకు సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఊరుకోటి పైడ్రాజు, బొట్ట చిన్న, నమ్మి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

విశాలాంధ్ర – సింహాచలం: గ్రేటర్ విశాఖలోని ఆయా వార్డుల్లో ఉన్న శైవాలయాలు జనసంద్రంతో నిండిపోయాయి. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. సింహాద్రిపై కొలువుతీరి ఉన్న బాల త్రిపురాంతక స్వామివారి ఆలయం, పంచాయతన కాశీవిశ్వేశ్వర స్వామివారి ఆలయాలతో పాటు కొండక్రింద ప్రధానాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మహా నారాయణ సేవలో మాజీ మంత్రి అవంతి

విశాలాంధ్ర – పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో ఉన్న శ్రీ ధర్మశాస్తా సేవా పీఠం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పద్మనాభం మండల పరిషత్ అధ్య క్షులు కంటుబోతు రాంబాబు నిర్వహించిన మహా నారాయణ సేవ కార్యక్రమంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు సోమవారం పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు అనంతరం ధర్మశాస్తా సేవా పీఠం అయ్యప్ప స్వాముల బృందం మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావుని, ఇతర పెద్దలను శాలువాలతో సత్కరించారు. చివరగా ధర్మశాస్తా పీఠం స్వాములకు ఉచిత బిక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి మహేష్, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, పద్మనాభం మండల వైసీపీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణ్, ఆనందపురం మండల పరిషత్ అధ్యక్షులు మజ్జి వెంకటరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ అప్పలనాయుడు, ఆనందపురం మండల వైసీపీ అధ్యక్షులు బంక సత్యం, గాడు శ్రీను, అముజూరి అప్పారావు పాల్గొన్నారు.

నెల్లిముక్కు కాశీ విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర – పెదగంట్యాడ: కార్తీక మాసం మొదట సోమవారం సందర్భంగా పెద గంట్యాడ నెల్లిముక్కు రామాలయం ప్రక్కన ఉన్న శ్రీ శ్రీ శ్రీ గోవిందమాంబా సమేత వీరబ్రహ్మేంద్రస్వామి సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాజువాక వర్తక సంఘం అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త తిప్పల నితీష్ రెడ్డి ప్రణీత రెడ్డి దంపతులు పూజలను ప్రారంభించారు. నితీష్ రెడ్డి మాట్లాడుతూ అన్ని మాసాలలో కార్తీక మాసం చాలా ప్రాముఖ్యత కలిగినదని శివుడుకి సోమవారం అంటే మహా ఇష్టమైన రోజు కనుకనే సోమశేఖరుడుగా అవతరించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తిప్పలదేవన్ రెడ్డి, ఎమిలి జ్వాల దంపతులు విశిష్ఠ అతిథి గా పాల్గొన్నారు. కార్యక్రమంలో అలయ ధర్మకర్త ముద్దుర్తి శ్రీరామ మూర్తి, ద్వారపూడి గురునాదరావు, కణితి అప్పల రాజు, ముద్దుర్తి సాంబ శివ రావు, ముద్దుర్తి అప్పల రాజు, పుట్టా కృష్ణ, ముద్దుర్తి శ్రీనివాస్, పులి సీతామహాలక్ష్మి, కొమ్మోజ శ్రీను, కొమ్మోజి హరి, కొమ్మోజ మహేష్, ద్వారపూడి సత్యం, పూడి హరీష్, ముద్దుర్తి రాము, చంటి ప్రసాద్, వై. శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమర్నాథ్‌కు రాజకీయ భిక్ష పెట్టింది చంద్రబాబు

– టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి

విశాలాంధ్ర – విశాఖ సిటీ: గుడివాడ అమర్నాథ్‌కు రాజకీయ భిక్ష పెట్టింది చంద్రబాబు నాయుడు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాటలను ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని విమర్శించే స్థాయి అమర్నాథ్‌కు లేదన్నారు. సచివాలయంలో ఐటీ మంత్రి ఛాంబర్‌లో నీరు కారుతుందని చెబుతున్న మాజీ మంత్రి ఆనాడు ఎందుకు బాగుచేసుకోలేకపోయారని ప్రశ్నించారు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రులు సచివాలయానికి వెళ్ళారా అని సందేహాన్ని వెలిబుచ్చారు. స్టార్ హోటల్స్‌లో సమావేశాలు నిర్వహించి ప్రజా ధనాన్ని వైసీపీ మంత్రులు వృధా చేశారని ధ్వజమెత్తారు. ప్రజా ధనాన్ని ఖర్చు చేసి ఋషికొండలో భవనాలు ఎందుకు కట్టారో ఎవరికి అర్థం కావడం లేదన్నారు. జగన్ రాష్ట్రానికి చేసిందేమీ లేదని, 11 లక్షల కోట్లు అప్పులు మాత్రం చేశారని ఎద్దేవా చేశారు. అమర్నాథ్ మంత్రిగా ఉండి ఎన్ని పరిశ్రమలు తెచ్చారు, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. విజయసాయిరెడ్డిని వెనకేసుకుని మరల ఉత్తరాంధ్రలో పెత్తనం చెలాయించడానికి చూస్తున్నారన్నారు. వైసీపీని వదిలి అనేక మంది బయటకు వచ్చేస్తున్నారన్నారు. అమర్నాథ్ మంత్రిగా ఉన్న సమయంలో ఎంత దోచుకున్నారో అందరికి తెలుసని, బెంగుళూరులో ఉన్న భవనాలు ద్వారా నెలకు కోటి రూపాయలు అద్దె రూపంలో వస్తుందని ఆరోపించారు.

అమర్నాథ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంట్ కోసం ఏం చేశారని, ఒక్కసారి అయిన కేంద్రంతో మాట్లాడారా అని ప్రశ్నించారు. రైల్వే జోన్‌కు భూమి ఇస్తే ఎందుకు కార్యాలయానికి శంకుస్థాపన చేయించ లేకపోయారని ప్రశ్నించారు. సమావేశంలో కార్పొరేటర్లు గొలగాని వీరారావు, పురుకూటి నారాయణ పాల్గొన్నారు.

ఫిర్యాదులు మళ్లీమళ్లీ రాకుండా జాగ్రత్త పడాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: వచ్చిన ఫిర్యాదు మళ్లీమళ్లీ రాకుండా జాగ్రత్త వహించాలని, ప్రజలు సమర్పించే వినతులకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ముందుగా గత వారం ప్రజలు సమర్పించిన వినతులపై అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. నిర్ణీత కాలంలో ఫిర్యాదులను పరిష్క రించాలని, మళ్లీమళ్లీ రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అవసరమైతే జిల్లాస్థాయి అధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడాలని, పూర్వాపరాలు తెలుసుకొని సంతృప్తికర స్థాయిలో పరిష్కారం తీసుకోవాలని చెప్పారు. పీజీఆర్ఎస్‌పై పక్కాగా ఆడిట్ నిర్వహించాలన్నారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 193 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి చెంది నవి 61, జీవీఎంసీకి చెందినవి 53, పోలీసు శాఖకు సంబ ంధించి 11, ఇతర శాఖలకు సంబంధించి 68 ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ నేత మస్తానప్పకు నివాళి

విశాలాంధ్ర – మల్కాపురం: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వైఎస్సాటీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప అకాల మరణానికి చింతిస్తూ హిందూస్తాన్ షిప్ యార్డ్ వైఎస్సార్‌టీయూసీ యూనియన్ నాయకులు స్థానిక యూనియన్ ఆఫీస్‌లో సోమవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మస్తానప్ప యూనియన్‌లో నాయకత్వం వహించి కార్మికులకు చేసిన సేవలు కొనియాడుతూ ఆయనకు ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ హిందీ విద్యార్థులకు రూ.లక్ష అందించిన వైఎల్పీ

విశాలాంధ్ర– విశాఖపట్నం: విద్యా సంబంధిత అభ్యసనలకు మద్దతుగా పద్మభూషణ్ అచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ఆంధ్రా విశ్వవిద్యాలయం హిందీ విభాగం విద్యార్థులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. నవంబర్ 27 నుండి డిసెంబర్ 3 వరకు జరిగే వారి విద్యా పర్యటనకు ఈ నిధులు సహాయ పడతాయన్నారు. సోమ వారం ఉదయం విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన వేడుకలో యార్లగడ్డ సమకూర్చిన చెక్కును వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అచార్య నరసింహారావు శాఖాధిపతి అచార్య ఎన్.సత్యనారాయణకు అందజేశారు. ఈ సంద ర్భంగా అచార్య లక్ష్మీ ప్రసాద్ యాత్ర యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. ముఖ్యంగా వారణాసితో సహా విద్యార్థులు సందర్శించే గమ్యస్థానాల సాంస్కృతిక, చారిత్రక విలువను వివరించారు. ఈ ప్రాంతం యొక్క గొప్ప వారసత్వం, అక్కడ జన్మించిన ప్రభావవంతమైన కవుల గురించి తెలుసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ అనుభవం హిందీ భాష, సాహిత్యంపై వారి అవగాహనను మరింతగా పెంచుతుం దన్నారు. ఆగ్రాలోని హిందీ సంస్థాన్‌ను సందర్శించాలని కోరారు. అక్కడ హిందీ భాషా ప్రచారం, అభివృద్ధికి చేస్తున్న వివిధ ప్రయత్నాలను గమనించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ అచార్య నరసింహారావు మాట్లాడుతూ హిందీ విభాగానికి లక్ష్మీప్రసాద్ గౌరవ అచార్యుని హోదాలో నిబద్ధతతో కూడిన సేవలు అందిస్తున్నారన్నారు. జాతీయ స్థాయిలో హిందీ భాషా ఉన్నతికి విశేష కృషి చేశారని కొనియాడారు. హిందీ విభాగానికి యార్లగడ్డ విలువైన ఆస్తిగా అభివర్ణించారు. విభాగాధిపతి అచార్య ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ, శాఖాపరంగా చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి వైఎల్పి సహకారం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెల్లంకిలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర – ఆనందపురం: మండలంలో వెల్లంకి గ్రామపంచాయతీలో డాక్టర్ లక్ష్మణ్ రాయల్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ బంటుపల్లి లక్ష్మణరావు ఆధ్వర్యంలో వెల్లంకి కళ్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ రెండు నెలలకు ఒకసారి ఉచిత మెడికల్ క్యాంపును అందుబాటులోకి తెస్తామని కావున పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, కర్రోతు సత్యనారాయణ, డాక్టర్ బృందం పాల్గొన్నారు.

గీతం విద్యార్థుల ఇంజనీరింగ్ ప్రతిభ

స్వయంగా రూపొందించిన వాహనంతో విజయం

విశాలాంధ్ర – మధురవాడ: ఇంజనీరింగ్ అభ్యసించే సమయంలో పొందిన సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి స్వయంగా తయారు చేసుకున్న మోటారు వాహనంతో జాతీయ స్థాయిలో జరిగిన సామర్థ్య పరీక్షల పోటీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ సత్తాను చాటి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గీతంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి అనుబంధంగా గల సొసైటి ఆఫ్ ఆటో మోటివ్ ఇంజనీర్స్ (గీతం ఆటోమేటివ్ క్లబ్)లో సి.హెచ్.ఉదిత్‌కుమార్, వి.యశ్వంత్, వి.యు.ఎస్.పవన్ యశ్వంత్, కె.సాయి రాజ స్వాన్, వై.శ్రీకాంత్‌రెడ్డి, ఎ.ఎస్.మురారి, కె.మోహనిస్, పి.శ్రీకాంత్, కె.వరుణ్, ఎస్.అచింతా సభ్యులుగా ఉన్న గీతం విద్యార్థులు ఇటీవల నోయిడాలోని బుద్ధ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో జరిగిన ఇండియన్ కార్టింగ్ రేస్ -2024 పోటీలలో పాల్గొని దేశంలోని 55 విశ్వవిద్యాలయాల జట్లతో పోటీ పడి ఈ ఘనతను సాధించారు. విద్యార్థులలో సృజ నాత్మక శక్తి, సాంకేతిక పరిజ్ఞానం, స్వయంగా తయారు చేసే వాహనం సామర్థ్యం వంటివి గుర్తించి ప్రోత్సహించడానికి గత పది సంవత్సరాల నుంచి జాతీయ స్థాయిలో ఈ పో టీలను నిర్వహిస్తున్నారు. గీతం ఆటోమేటివ్ క్లబ్ సభ్యులుగా ఉన్న విద్యార్థులు వాహనం ఇంజన్ నుంచి తయారీలో ఉపయోగించే చిన్న చిన్న బోల్టు వరకు స్వయంగా ఎంపిక చేసికుని వాహన డిజైనింగ్ ప్రకారం వెల్డింగ్ పనులు సహితం నిర్వహించి నాలుగు నెలల ప్రణాళికతో "టీమ్ టైరంట్స్ ఇవి" పేరిట వాహనాన్ని తయారు చేసుకోవడం విశేషం. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకుల పర్యవేక్షణలో రూపొందిచిన తమ వాహనంతో జాతీయ స్థాయి పోటీలలో విజయం సాధించారు. విద్యార్థుల ప్రతిభను గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌత మ్‌రావు, విద్యార్థి విభాగం డైరెక్టర్ డాక్టర్ రేమా చౌదిరి, మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రామారావు, స్టూడెంట్ లైఫ్ ఎల్.అభిషేక్ అభినందించారు.

విద్యా రంగానికి కూటమి అధిక ప్రాధాన్యం

విశాలాంధ్ర – పద్మనాభం: విద్యారంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్య మిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన కె.జి.వి.బి. వసతి గృహాన్ని సోమవారం ప్రారం భించారు. 2019లో టీడీపీ ప్రభుత్వ హయంలో శంకుస్థాపన చేసిన భవనాన్ని కూటమి ప్రభుత్వ హయాంలో తిరిగి తానే ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కె.జి.వి.బి.లో విద్యా, వసతి సౌకర్యాల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గుంతలు లేని ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ జనవరి నాటికి "గుంతలు లేని ఆంధ్రప్రదేశ్" పనులను నాణ్యతతో రాజీ పడకుండా వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పద్మనాభం మండలం టీడీపీ అధ్యక్షుడు కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరారావు, కాళ్ల నగేష్ కుమార్, లీలావతి, సత్యనారాయణ, జనసేన నాయకుడు శాఖారి శ్రీనివాస్, బీజేపీ భీమిలి ఇన్‌చార్జి కె.రామానాయుడు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు సెలవు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని జోన్‌లలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నాగుల చవితి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ సోమవారం తెలియజేశారు. కావున నగర ప్రజలకు తెలియజేయునది ఏమనగా నాగుల చవితి సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు సెలవు ప్రకటించినందున ఆరోజు వ్యర్థాల ను మరుసటి రోజు అనగా నవంబర్ 6 వ తేదీ బుధవారం నాడు విధులకు హాజరయ్యే పారిశుద్ధ్య కార్మికులకు అందజేయవలసిందిగా కమిషనర్ తెలియజేశారు.

HINDUJA HOUSING FINANCE

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: 167-169, 2వ అంతస్తు, అన్నాసలై, సైదాపేట్, చెన్నై-600 015, CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com, ప్రాంతీయ కార్యాలయం: డోర్ నం.54-20-10/1ఎ, 3వ అంతస్తు, గురునానక్‌కాలనీ, మెయిన్‌రోడ్డు, ఎస్‌బీఐ బ్యాంక్‌ఎదుట, విజయవాడ-520008

డిమాండ్ నోటీసు

మీరు, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు ఈ కింద వివరించినట్లుగా మీ యొక్క స్థిర ఆస్తి(లు)ని తనఖా పెట్టుట ద్వారా ఆస్తి సౌకర్యం(లు)పై హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుండి హోమ్‌లోన్/లోన్ వినియోగించుకున్నారు. ఈ మొత్తాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనారు; మీ రుణాలు నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడ్డాయి. బకాయి పడిన మొత్తాలను తిరిగి రాబట్టుకునేందుకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 కింద చివరిగా తెలిసిన మీ యొక్క చిరునామాలకు పంపిన డిమాండ్ నోటీసు అందజేయబడక తిరిగి పంపబడినది. అందుచేత ప్రత్యామ్నాయ సర్వీసుగా ఈ నోటీసులోని అంశాలను సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలు, 2002 నిబంధన 3(1)తో చదివే చట్టంలోని సెక్షన్ 13(2) కింద ఇచ్చుట ప్రచురించబడుచున్నవి. రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, హామీదారులు, సెక్యూరిటీలు, మొత్తం బకాయిలు, సెక్షన్ 13 (2) కింద పంపిన డిమాండ్ నోటీసు మరియు క్లెయిమ్ చేసిన మొత్తం మొదలైన వాటి వివరాలు ఈ కింద ఇవ్వబడ్డాయి :

వ.సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత/హామీదారు పేరు/ రుణఖాతా నం.	ఎన్‌పీఏ తేదీ	డిమాండ్ నోటీసు తేదీ & బకాయి మొత్తం
1	1. శ్రీ చేబ్రోలు ప్రసాద్ ... రుణగ్రహీత, 2. శ్రీమతి చేబ్రోలు లక్ష్మి, ...సహ-రుణగ్రహీత. 3. శ్రీ చేబ్రోలు రమణ,ఇద్దరూ నివసించునది: ఆర్/ఓ.డి.నం: 4-23(2), కాలనీ, ధర్మసాగరం రూరల్, అనకాపల్లి, విశాఖపట్నం-531116. రుణఖాతా సంఖ్య: LAN No. AP/VKP/NRPT/A000000049	05.09.2024	02.11.2024 & తేదీ :29.10.2024 నాటికి వడ్డీతో పాటు రూ.7,71,028/- (ఏడు లక్షల డెబ్బై ఒక్కవేల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే)
	ఆసక్తి సృష్టించబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు: అనకాపల్లి జిల్లా, కోటౌరట్ల ఎస్ఆర్ఓ పరిధులు, ధర్మసాగరం గ్రామ పంచాయతీ, నర్సీపట్నం మండలం, ధర్మసాగరం గ్రామ పంచాయతీ, ధర్మసాగరం గ్రామం, సర్వే నం.156లో వ్యాపించియున్నది, గ్రామకంఠం డోర్ నం.5-19, అసెస్మెంట్ నం.619 ఆధారంగా ఆర్‌సిసి పైకప్పు ఇంటితో కలిసియున్న 177.33 చదరపు గజాలు లేదా 148.27 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఇంటి ఆస్తి మొత్తంగా. 759 ఎస్ఎఫ్‌టి ఆర్‌సిసి భవనం సరిహద్దులు: తూర్పు: రొంగాల మాణిక్యం ఖాళీ స్థలం, దక్షిణం: పంచాయతీ సిసి రోడ్డు, పడమర: కొప్పూరు కుమారి శ్లాబ్ వేసిన ఇల్లు, ఉత్తరం: మారుతి అచ్చాయమ్మ యొక్క ఎసిసి షీట్ షెడ్.		
2	1. శ్రీ అప్పారావు వంగల ... రుణగ్రహీత, 2. శ్రీమతి లక్ష్మి వంగల....సహ-రుణగ్రహీత. ఇద్దరూ నివసించునది: ఆర్/ఓ. డోర్ నం..30-63-41/ఎ, హైస్కూల్ రోడ్డు, ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, కణితి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530046 రుణఖాతా సంఖ్య: AP/VKP/VJNR/A000000004 & AP/VKP/VSKP/A000000325.	05.09.2024	02.11.2024 & తేదీ :30.10.2024 నాటికి వడ్డీతో పాటు రూ.9,08,930/- (తొమ్మిది లక్షల ఎనిమిది వేల తొమ్మిది వందల ముప్పై రూపాయలు మాత్రమే)
	ఆసక్తి సృష్టిం చబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు : - భాగం-1 ఆస్తి వివరణ: విశాఖపట్నం జిల్లా పరవాడ మండలం, లాసెలపాలెం, ఎస్ఆర్ఓ దేశపాత్రునిపాలెంలోని సర్వే నెం. 101/1, 3, 4, 103/2 ద్వారా కవర్ చేయబడిన సుబ్రహ్మణ్య నగర్-2 లేఅవుట్‌లోని ప్లాట్ నెం. 133 పరిధిలోని 325 చదరపు గజాల విస్తీర్ణంలో ఉత్తర భాగమైన 186.66 చదరపు గజాల భూమి. సరిహద్దులు: తూర్పు: విక్రేత ఆర్. సూర్యనారాయణ అమ్మిన ఆస్తి, మరియు విక్రేత వదిలివేసిన 5 అడుగుల రాస్తా దక్షిణం: ఆర్.సూర్యనారాయణకు విక్రయించిన ప్లాట్ నెం. 133 భాగం. పడమర: ప్లాట్ నెం. 132, ఉత్తరం: రోడ్డు.		
3	1. రాము సూర్యమహేశ్వరరావు యెల్లాపు ... రుణగ్రహీత, 2. శ్రీమతి కళావతి యెల్లాపు...సహ-రుణగ్రహీత. ఇద్దరూ నివసించునది: ఆర్/ఓ. డోర్ నం..1-6, కోటౌరట్ల మండలం, రాజుపేట, విశాఖపట్నం-531085...రుణగ్రహీత రుణఖాతా సంఖ్య: AP/VKP/NRPT/A000000004	05.09.2024	02.11.2024 & తేదీ :30.10.2024 నాటికి వడ్డీతో పాటు రూ.6,92,916/- (ఆరు లక్షల తొంభై రెండువేల తొమ్మిది వందల పదహారు రూపాయలు మాత్రమే)
	ఆసక్తి సృష్టిం చబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు : - విశాఖపట్నం జిల్లా కోటౌరట్ల ఎస్.ఆర్.ఓ పరిధులు, కోటౌరట్ల మండలం, రాజుపేట గ్రామం యొక్క గ్రామకంఠం సర్వే నం:13లో వ్యాపించియున్నది, వార్డ్ నం.1, డోర్ నం.1-26, అసెస్మెంట్ నం: 26, కరెంట్ సర్వీస్ మీటర్ నం: 000180, ఆధారంగా 575 చదరపు అడుగులు లేదా 522.675 చదరపు మీటర్ల కొలత ఆర్.సి.సి. పైకప్పు ఇంటితో కలిసి 225.555 చదరపు గజాలు లేదా 188.5865 చదరపు మీటర్ల కొలత విస్తీర్ణపు ఆస్తి మొత్తంగా. సరిహద్దులు: తూర్పు: వి.పైడికొండ ఆర్.సి.సి. పైకప్పు ఇల్లు, దక్షిణం: అదారి అప్పారావు & అదారి శ్రీను ఖాళీ స్థలం, పడమర: గ్రామ పంచాయతీ సిమెంటు రోడ్డు, ఉత్తరం: వి.లక్ష్మణరావు & వి. సూరిబాబు ఇల్లు. సెటిల్‌మెంట్ డీడ్ నం: 3138/2021, తేదీ: 05-01-2021, ఎస్ఆర్ఓ. కోటౌరట్ల.		

చట్టంలోని సెక్షన్ 13(2) కింద నోటీసు జారీ చేసిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలో మొత్తం బాకీ చెల్లించవలసిందిగా పై రుణగ్రహీత/లుకు సూచించడమైనది. విఫలమైన పక్షంలో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నిబంధనల ప్రకారం పైన ప్రస్తావించిన 13 (2) సెక్షన్ కింద జారీ చేసిన నోటీసు తేదీ నుండి 60 రోజుల గడువు ముగిసిన పిమ్మట తదుపరి చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

తేదీ : 05.11.2024, ప్రదేశము : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

జివిఎంసి “ప్రజా సమస్యల పరిష్కార వేదిక ”లో 87 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న “ప్రజా సమస్యల పరిష్కార వేదిక”కు 87 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరం లో జివిఎంసి కమీషనరు డా.పి.సంపంత్ కుమార్‌తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 87 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 01, 2వ జోన్ కు 20, 3వ జోన్ కు 11, 4వ జోన్ కు 08, 5వ జోన్ కు 11, 6వ జోనుకు 06, 7వ జోన్ కు 01, 8వ జోన్ కు 04, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 15 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అకౌంట్సు విభాగమునకు 08, రెవెన్యూ విభాగమునకు 06, ప్రజారోగ్య విభాగమునకు 06, పట్టణ ప్రణాళిక విభాగమునకు 36, ఇంజినీరింగు విభాగమునకు 24, యు.సి.డి విభాగానికి 07 కలిపి మొత్తంగా 87 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనరు మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను పరిష్కరించాలని జివిఎంసి అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద రాజు, ప్రధాన వైద్యాధికారి డా.నరేష్ కుమార్, సిసిపి ఏ.ప్రభాకర్ రావు, సిపి మీనా కుమారి, ఎసిపి హరిదాస్, డిసి(రెవెన్యూ) శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎం.దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఎఫ్.ఎ%ఙ%ఎ.ఓ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజినీర్లు గోవిందరావు, పివివి సత్యనారాయణ రాజు శాంసన్ రాజు, రామమోహనరావు, కె.వి.ఎన్.రవి, కార్యనిర్వాహక ఇంజనీర్ దిలీప్ సంపత్ కుమార్, డిపిఒ ఎం.వి.డి ఫణిరామ్, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ ఎన్.కిషోర్, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, బయోలజిస్ట్ సాంబమూర్తి, ఆర్.ఎఫ్.ఒ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడు నా ఆస్తిని అక్రమంగా కాజేశాడు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తప్పుడు డాక్యుమెంట్లతో మోసం చేసి అనకాపల్లిలో తన సొంత ఆస్తిని అక్రమంగా కాజేసిన జనసేన నాయకుడు బి.సురేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని, సెటిల్మెంట్ దస్తావేజు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని, తనకు తగిన న్యాయం చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి బాధితరాలు పి.భారతి వేడుకున్నారు. సోమవారం విజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె పడుతున్న కష్టాన్ని వివరించారు. తన అమ్మమ్మ బుద్ధ సత్యవతి నుంచి వారసత్వంగా 150 గజాల విస్తీర్ణం గల పాత ఇల్లు గిఫ్ట్ డీడ్ ద్వారా ఇచ్చిందని ఆ ఆస్తిని కాజేసేందుకు తనకు దగ్గర బంధువైన జనసేన నాయకుడు బి.సురేష్ రాజకీయ పరపతితో అన్ని విధాల వేధింపులకు, భయభ్రాంతులకు గురి చేస్తూ బలవంతంగా తన ఆస్తిని రిజిస్ట్రేషన్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో చేయించుకుని చేతిలో అతి తక్కువ నగదు పెట్టి మిగతా సొమ్ము ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తన అమ్మమ్మ ఎకరం వ్యవసాయ భూమిని కూడా కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ఆస్తి ఒరిజినల్ డాక్యుమెంట్లు గతంలో తాను అప్పు తెచ్చుకున్న కోటేశ్వరరావు అనే వ్యక్తి దగ్గర ఉన్నాయని, సరైన డాక్యుమెంట్లు లేకుండా బలవంతంగా తన ఆస్తిని సెటిల్మెంట్ దస్తావేజు, రిజిస్ట్రేషన్ అక్రమంగా చేసుకుని వేధిస్తున్నాడని ఆమె ఆరోపించారు. పోలీసులకు, అనకాపల్లి సబ్ రిజిస్టర్ కు ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదని ఈ విషయంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ విచారణ చేసి న్యాయం చేయాలని, తన ఆస్తిని ఇప్పించాలని ప్రార్థించారు.

కలెక్టర్‌తో భేటీ అయిన మాల్దీవుల ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం జిల్లా పర్యటనలో భాగంగా పలువురు మాల్దీవుల ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌తో భేటీ అయ్యారు. విజ్ఞానయాత్రలో భాగంగా విశాఖపట్నం జిల్లా పెందుర్తి, తదితర ప్రాంతాల్లో పర్యటించిన వారు పలు పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించారు. పంచాయతీరాజ్ విధానాలు, స్వయం సహాయక సంఘాల పనితీరు, నిర్వహణ, పొదుపు, ఇతర ఆదాయ మార్గాల గురించి అడిగి తెలుసుకున్నారు. పెందుర్తి ఎంపీ డీఓ కార్యాలయాన్ని సందర్శించి మాల్దీవుల ప్రజాప్రతినిధులు అక్కడి పరిస్థితులను గమనించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా అందే సేవలను తెలుసుకున్నారు. ప్రభుత్వ వ్యవస్థలకు, ప్రజలకు మధ్య ఉండే అనుబంధాల గురించి అవగాహన పెంచుకున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో కలెక్టర్, ఇతర అధికారులతో వారంతా భేటీ అయ్యారు. జిల్లా పర్యటనలో గుర్తించిన అంశాలపై వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈసందర్భంగా జిల్లాలోని పరిపాలనాపరమైన అంశాలు, విధానాలు, పద్ధతుల గురించి మాల్దీవుల ప్రజాప్రతినిధులకు వివరించారు. పలు అంశాలపై వారి సందేహాలను నివృత్తి చేశారు.

10 నుండి కార్తీక దీపోత్సవం, ద్వాదశి జ్యోతిర్లింగ కార్యక్రమం

విశాలాంధ్ర - ఆనందపురం: కార్తీక దీపోత్సవం, ద్వాదశి జ్యోతిర్లింగ కార్యక్రమం ఈనెల 10వ తేదీ నుండి 12 వరకు జిఎస్ఎన్ ఫంక్షన్ హాల్ వద్ద నిర్వహించబడునని ఓం శాంతి నిర్వాహకులు సంధ్య తెలిపారు. వేములవలస జిఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 10 కార్తీక దీపోత్సవం, 11న ద్వాదశి జ్యోతిర్లింగ దివ్యదర్శనం 12 రుద్ర జ్ఞాన కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు. ప్రతిరోజు ఉదయం నాలుగు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించబడునన్నారు. ప్రముఖ యోగా గురువులచే 13 నుండి 16 వరకు యోగ క్లాసులు ఆరోగ్య సూత్రాలపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమానికి భక్తులు, ఉత్సాహవంతులు అందరూ పాల్గొని విజయ వంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవం, ద్వాదశి జ్యోతిర్లింగ దివ్య దర్శనానికి మణికంఠ హార్డ్వేర్ ఎలక్ట్రికల్ వేములవలస బండారు శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో కర పత్రాలను ముద్రించినట్లు తెలిపారు. భక్తులు పాల్గొని శివ కృపకు పాత్రులు కాగలరని కోరారు.

లింగ్విస్టిక్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసిన శామ్‌సంగ్ ఇనిస్టిట్యూట్

విశాలాంధ్ర- విశాఖపట్నం: శామ్‌సంగ్ ఆర్ అండ్ డి ఇనిస్టిట్యూట్ ఇండియా బెంగుళూరులోని గార్డెన్ సిటీ యూనివర్శిటీ తో కలిసి ‘శామ్‌సంగ్ స్టూడెంట్ ఎకోసిస్టమ్ ఫర్ ఇంజినీర్డ్ డేటా ల్యాబ్‌ని ఏర్పాటు చేసి, విద్యార్థులు అధ్యాపకులకు ఏఐ/ఎం ఎల్ డేటా ఇంజినీరింగ్ ప్రపంచంలోకి ప్రవేశించడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది. ల్యాబ్‌లో జీసీయూలోని విద్యార్థులు ఫ్యాకల్టీ సభ్యులు ఎస్ ఆర్ఐబీలోని సీనియర్ ఇంజనీర్లతో సహజ భాషా అవగాహన, స్పీచ్ మరియు టెక్స్ట్ రికగ్నిషన్ మరియు మెషిన్ లెర్నింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న అత్యాధునిక సాంకేతిక రంగాలపై ఉమ్మడి ప్రాజెక్టుల ద్వారా అనుభవాన్ని పొందుతారు.

శామ్‌సంగ్ ఇప్పటికే నాలుగు సీడ్ ల్యాబ్‌లను - రెండు ల్యాబ్‌లు కర్ణాటకలో రెండు ల్యాబ్‌లు తమిళనాడులో ప్రారంభించి, ఏఐ డేటా సంబంధిత ప్రాజెక్టులలో 400 కంటే ఎక్కువ మంది విద్యార్థులను నిమగ్నం చేసింది.

8న పోర్టు ఏఓజీ కార్యాలయం వద్ద

మహాధర్నా జయప్రదం చేయండి

విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు ఐక్య వేదిక పిలుపు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖపట్నం పోర్ట్ ఆసుపత్రిని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఈ నెల 8న పోర్టు ఏఓబీ వద్ద జరగబోయే మహాధర్నాను జయప్రదం చేయాలని విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సోమవారం సీఐటీయూ జగదాంబ ఆఫీస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను సాలిగ్రాంపురంలో 1984వ సంవత్సరంలో 150 పడకల సామర్థ్యంతో నిర్మించారని, పోర్టు, డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్ అయిన కార్మికులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు, పూల్ కళాశీలకు, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులకు సిఐఎస్ఎఫ్ ఉద్యోగులు వారి వారి కుటుంబ సభ్యులకు దశాబ్దాల తరబడి 40వేల మందికి సేవలందిస్తుందన్నారు. అటువంటి మన పోర్టు హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో “మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్”గా 300పడకల నిర్మాణం కొరకు ప్రైవేట్‌వారికి ఇచ్చుటకు పోర్టులో వున్న యూనియన్స్ అన్నీ వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం ఏకపక్షంగా నవంబరు 8న టెండరు ఓపెన్ చేస్తున్నారన్నారు. ఈ చర్య 40 వేల మంది ఆరోగ్య భద్రతను ప్రైవేట్ చేతుల్లో పెట్టడమేనని, ఇదే జరిగితే ప్రైవేట్ యాజమాన్యం దయాదాక్షిన్యాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ఈనెల ఎనిమిదో తేదీ 10గంటలకు పోర్టు ఎటిబి వద్ద జరగబోయే మహాధర్నాలో పెద్ద ఎత్తున పోర్ట్ డాక్ ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, క్యాజువల్ వర్కర్లు, పూల్ కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, కార్మిక, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాలకు పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో ప్రైవేటు వారికివ్వరాదని, దానికి బదులుగా నిరంతరం లాభాలతో నడుస్తున్న విశాఖ పోర్టు సొంత నిధులతోనే పోర్టు ఆసుపత్రిని మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, స్పెషలిస్ట్ డాక్టర్లను, ల్యాబ్ మిషనరీలను, స్పెషలైజ్డ్ స్టాఫ్‌ను, నాణ్యమైన మందులను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేసే చర్యలను చేపట్టాలని డిమాండ్‌తో ధర్నా చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమణ బాబు, హెచ్ఎంఎస్ నాయకులు కె.మంగయ్య నాయడు, సీఐటీయూ నాయకులు బి.జగన్, కె.సత్యనారాయణ, బి.లక్మణరావు, జె.సత్యనారయణ, వి.రామలింగేశ్వర రావు, సీ ఎఫ్ టీ యూ ఐ నాయకులు క్రిష్ణ మూర్తి, ఐఎన్‌టియుసి నాయకులు జి.చందు, బిఎంఎస్ నాయకులు బి. రవి, పెన్షన్స్ సంఘం నాయకులు బి రామారావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక కబ్జాచేసి హోటల్ నిర్మాణమా...?

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: మత్స్యకారులు దైవమందిరాలుగా భావించే శ్మశానవాటికను కబ్జాచేసి బార్ అండ్ రెస్టారెంట్ నిర్మించి వారి మనోభావాలను దెబ్బతీసే హోటల్ యాజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎగువపేట గ్రామాభివృద్ధి సేవాసంఘం అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా భీమిలి జోనల్ కమీషనర్ ప్రేమ ప్రసన్న వాణికి జలగెద్ద శ్మశానవాటికలో జరుగుతున్న అక్రమాలపై గ్రామాభివృద్ధి సేవాసంఘం సభ్యులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ సిఆర్ జెడ్ నిబంధనలు ఉల్లంగించడమే కాకుండా చట్టవిరుద్ధంగా బార్ అండ్ రెస్టారెంట్‌లు నడుపుటకు అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. 500 ఏళ్లుగా మా ఎగువపేట గ్రామంలో ఉండే మత్స్య కారులు ఈ స్థలంలో శ్మశానవాటికగా ఉపయోగిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు ఈ 9 జిల్లాలో తీరప్రాంతంలో ఉండే మత్స్యకారులు సముద్రాన్ని ఆనుకొని శ్మశానవాటికలు ఉంటాయని అన్నారు. వీటిని తమ దైవమందిరాలుగా ఉపయోగించి పూజిస్తామని అన్నారు. అలాంటి వాటిని అమతపు శ్రీకాంత్ మణికంఠ సాయి కుమార్ అనే వ్యక్తి బీ.. జాగ్ బీచ్ క్లబ్ హోటల్‌ను నిర్మించి మా మనోభావాలు దెబ్బతీస్తున్నారని అన్నారు. సి ఆర్ జెడ్ నిబంధనలు ప్రకారం సముద్రం పెద్ద కెరటం (హై టైడ్) తాకిన దగ్గర నుండి 150 మీటర్లు వరకు నో డెవలప్మెంట్ జోన్ అని తెలిసినా హోటల్ నిర్మించిన వ్యక్తిపై ఎందుకు అధికారులు చర్యలకు వెనుకాడుతున్నారని గంటా నూకరాజు ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో తీరంవెంబడి హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్ లు, స్టార్ హోటల్స్ కడితే ఇక మత్స్యకారుల స్మశానవాటికలు ఎక్కడ ఉంటాయని అడిగారు. ఒక సామాజిక వర్గం మనోభావాలను దెబ్బతీసే అధికారం ఎవరికి ఎవరిచ్చారని నిలదీశారు. హోటల్ యాజమాని అక్రమాలకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకోకుండా తిరిగి స్మశానవాటికలో పార్థివ దేహాలను ఖననం చేయరాదు అని జీవిఎంసీ అధికారులు బోర్డులు పెట్టడం వెనుక పరోక్షంగా మీరుకూడా హోటల్ వారికి సహకారం అందిస్తున్నారని భావించవచ్చా అని అడిగారు. దయచేసి ఎన్నో తరాలుగా మా మత్స్య కారులు వాడుకుంటున్న స్మశానవాటిక స్థలాన్ని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు. జోనల్ కమీషనర్ ని కలిసిన వారిలో గ్రామాభివృద్ధి సేవాసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లివిల్లి నర్సింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు ఉన్నారు.

18 సెంట్లు వారసత్వ భూమిని తమ పేరున మార్చండి

గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు బాధితుడి వినతి

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో గిడిజాల గ్రామానికి చెందిన కర్రీ ఈశ్వరరావు తండ్రి లేటు అప్పలస్వామి సోమవారం విశాఖ కలెక్టర్‌కు భూ సమస్యపై స్పందనలో ఫిర్యాదు చేశారు. గిడిజాల గ్రామ రెవెన్యూ పరిధిలో డిఆర్ నెంబర్ 1165/79, ప్రకారం వారసత్వ ఆస్తి సర్వే నెంబర్ 178-12 లో మా తాత కర్రి రామస్వామి సన్యాసి పేరు మీద 18 సెంట్లు బి పట్టా మంజూరు చేశారని అప్పట్నుండి మామిడి మొక్కలు వేసుకొని మేము అనుభవంలో ఉన్నామని అడంగల్ -3, పసలీ నెంబర్.1422 /2012,1424/2024లో కర్రీ రామ నర్సింహం తండ్రి రామస్వామి పేరిట అనుభవదారుడు గాను, పట్టాదారుడు గాను తప్పుగా నమోదు చేశారని, ఖాతా నెంబర్ 10 316లో కర్రీ రామ నర్సింహం, తండ్రి రామస్వామి పేరిట తప్పుగా వన్ బిలో నమోదు చేశారన్నారు. ప్రస్తుత ఆన్లైన్‌లో వన్ బిలో ఉన్నవాళ్లు అసలైన వారసులు కారని రామ నరసింహం, నారాయణప్పుడు, అప్పలనాయుడు, మా విలేజ్‌కి సంబంధించిన ముగ్గురూ వ్యక్తులు వీరి నాన్న, పేరు మా తాత రామస్వామి ఒకటే పేరు అయినందున మా గ్రామం లో ఉన్న స్థానికి నాయకులు (అప్పట్లో రెవెన్యూ సిబ్బంది) అయినందువలన ప్రస్తుతం ఉన్న రెవెన్యూ అధికారులు అండదండలతో 2012 సంవత్సరం 2014 సంవత్సరంలో ఫ్రీ ఓల్డ్ భూమిగా వారి పేరున పట్టా మంజూరు చేశారని, తప్పుగా పట్టా చేసిన భూములను గ్రామ సభ పెట్టి నిజా నిజాలు తెలుసుకొని అసలైన వారసులు అయిన లేటు కర్రీ రామస్వామి కుమారుడు (లేటు)కర్రి అప్పలస్వామి కుమారుడు కర్రి అప్పలనాయుడుకి వారసత్వంగా ఉన్న 18 సెంట్లు భూమిని తిరిగి వారి పేరు మీద పట్టా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కి స్పందనలో తెలియజేశారు.

స్కిల్ సెన్సెస్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రిన్సిపల్ సెక్రటరీ గణేష్ కుమార్

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రతి గ్రామంలో ఉన్న వ్యక్తుల స్కిల్స్ సెన్సెస్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ స్కిల్ డెవలప్మెంట్ సీఈఓ గణేష్ కుమార్ పేర్కొన్నారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జానకి ఆధ్వర్యంలో స్కిల్ సెన్సస్ సర్వేపై సచివాలయం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో స్కిల్ డెవలప్‌మెంట్ శాఖా మంత్రి నారా లోకేష్ సారధ్యంలో ఆంధ్ర రాష్ట్రంలోని 15 నుండి 59 వయస్సు మధ్య గల వ్యక్తులకు సంబంధించిన విద్యా అర్హతలు, ఉద్యోగ అనుభవం వారి మెరుగైన ఉద్యోగ ఆసక్తులను సేకరించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ను నైపుణ్యాభివృద్ధిగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన బృహతర స్కిల్ సెన్సెస్ సర్వే అన్నారు. ఇప్పటికే గుంటూరు జిల్లా మంగళగిరి, తాటికొండ నియోజక వర్గంలోని తుళ్ళూరు మండలం పరిదిలో స్కిల్ సెన్సెస్ సర్వేను పైలట్ ప్రాజెక్ట్ చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్లోని అన్ని జిల్లాలో నవంబర్ 2వ వారంలో ప్రారంభం కాబోతున్న స్కిల్ సెన్సెస్ సర్వేలో భాగంగా మన జిల్లాలో సర్వే చేబట్టబోయె ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్కిల్ సెన్సెస్ సర్వేకు సంబంధించి జిల్లా కలెక్టర్గారి పర్యవేక్షణలో జిల్లా జాయింట్ కలెక్టర్, నోడల్ ఆఫీసర్ డిఎస్‌డిఓ, డీఈవోలు కో ఆర్డినేటర్గాను మండల పరిదిలో ఎంపీడీవో, పట్టణ ప్రాంతం మండలాల్లో మున్సిపల్ కమీషనర్ నోడల్ ఆఫీసర్గా వ్యవహరిస్తారన్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయాన్ని యూనిట్గా తీసుకుని సదరు సచివాలయ జనవాసాలను క్లస్టర్గా విభజించుకుని ఒక్కో క్లస్టర్కు ఒక ఎన్యుమరేటర్ను నియమించుట ద్వారా సర్వే నిర్వహించబడుతుందన్నారు. ప్రతి ఎన్యుమరేటర్కు నిర్దిష్ట కుటుంబాలను మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ మొత్తం సర్వే కార్యక్రమాన్ని స్కిల్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వి.జానకి, మాస్టర్ ట్రైనర్ డి.శివసంపత్ కుమార్, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.